


# వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక

ఆదివారం,
మార్చి 2, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-



## 24 గంటల్లో బయటికి!

ఒకచోట నలుగురు, మరోచోట నలుగురు ఉన్నట్టు ఆనవాళ్లు

ఆదివారం సాయంత్రానికి నలుగురిని వెలికితీసే అవకాశం

మిగతా వారి కోసం మరో రెండు రోజులు పట్టవచ్చంటున్న నిపుణులు

మట్టి, బురదను తొలగించిన కొద్దీ ఉబికివస్తున్న ఊట నీరు

సహాయక చర్యల్లో వేగం పెంచిన రెస్క్యూ బృందాలు

పరిస్థితిని సమీక్షించిన మంత్రులు ఉత్తమ్, జూపల్లి

నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది కార్మికుల్లో నలుగురిని ఆదివారం బయటకు తీసే అవకాశం కనిపిస్తోంది. ప్రమాద స్థలంలో ఒకచోట నలుగురు, మరోచోట నలుగురు కార్మికుల ఆనవాళ్లను (గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్ ) గుర్తించింది. సొరంగం పైకప్పు కూలిపడిన సుమారు 150 మీటర్ల స్థలంలో ముందు భాగంలో నలుగురు, చివరి భాగం (ఎండ్ పాయింట్)లో నలుగురు ఉన్నట్టుగా 'నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)' నిపుణులు అంచనా వేశారు. ముందు భాగంలో ఉన్న నలుగురిని బయటికి తీసేందుకు సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్ బృందాలతో మ్యాన్యువల్‌గా తవ్వకాలు చేపట్టారు. కొన్ని గంటల్లోనే వీరిని వెలికితీసే అవకాశం ఉందని తెలిసింది. ఇక చివరి భాగంలో ఉన్న నలుగురు టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) హెడ్‌కు సుమారు 15 మీటర్ల వెనకాల చిక్కుకొని ఉన్నట్టుగా భావిస్తున్నారు. అక్కడ సుమారు 18 అడుగుల ఎత్తున మట్టి, శిథిలాలు పేరుకుని ఉండటంతో.. అక్కడున్న నలుగురిని బయటికి తీసేందుకు ఒకటి, రెండు రోజులు పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు.

**బురద, ఊట నీటితో ఆటంకం..**

సొరంగం పైకప్పు కూలిన ప్రాంతంలో

(మిగతా 2వ పేజీలో)

## ఇక క్రమం తప్పకుండా కార్యకర్తలను కలుస్తా

జీడీ నెల్లూరులో టీడీపీ కార్యకర్తలతో చంద్రబాబు సమావేశం

కార్యకర్తల వల్లే ఎన్నికల్లో విజయం దక్కిందని వ్యాఖ్యలు

వైసీపీ నేతలకు సాయం చేస్తే పాముకు పాలు పోసినట్టేనని స్పష్టీకరణ




చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరులో నేడు పేదల సేవలో కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యకర్తలను చూస్తే తనకు కొండంత ధైర్యం వస్తుందని అన్నారు. గత 8 నెలలుగా పరిపాలనలో నిమగ్నమయ్యానని, అందుకే పార్టీ శ్రేణులతో సమావేశం కాలేకపోయానని వివరణ ఇచ్చారు. మళ్లీ ఇన్నాళ్లకు కుటుంబ సమానులైన కార్యకర్తలను కలుసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. "30 ఏళ్ల తర్వాత జీడీ నెల్లూరు కోటపై టీడీపీ జెండా ఎగురవేశాం. పార్టీ విజయం కోసం కార్యకర్తలు ప్రాణం పెట్టి పనిచేశారు. మీకు నేను పూర్తిగా సహకరిస్తా. ఈ నియోజకవర్గం పార్టీకి కంచుకోటగా మార్చాలి. తంబళ్లపల్లి, పుంగనూరులో కొంచెం గురి తప్పాం తప్ప జిల్లా అంతటా టీడీపీ జెండా ఎగిరింది. వై నాట్ 175, వై నాట్ కుప్పం అన్నవాళ్లు ఇప్పుడు ఏమయ్యారు.? మొన్నటి ఎన్నికల్లో సరిగా చేసుకుని ఉంటే పులివెందులలోనూ మనమే గెలిచేవాళ్లం. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అనేక సమస్యలు ఎదుర్కొన్నాం. ఈసారి మనం పకడ్బందీగా వ్యవహరించడంతో ఉమ్మడి జిల్లాలో 12 స్థానాలు గెలిచాం. మిమ్మల్ని, నన్ను ఎన్ని ఇబ్బందుల పెట్టినా ప్రాణాలు పోయినా పర్వాలేదు గానీ, వారికి లొంగబోమని పోరాడటంతో 93 శాతం సీట్లు గెలిచాం" అని వివరించారు.

**ఆ రోజు టీడీపీని నేనే ఓడించుకున్నా**

2004, 2019లో పార్టీని నేనే ఓడించుకున్నా. రాష్ట్రాన్ని బాగు చేయాలని, ప్రజల తలరాతలు మార్చాలని మిమ్మల్ని (కార్యకర్తలను) పట్టించుకోకుండా పని చేశా. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో

(మిగతా 2వ పేజీలో)



## యాదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**నేటి నుండి మార్చి 11వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు**

**ఆలయ గోపురానికి బంగారు తాపడం అనంతరం మొదటి బ్రహ్మోత్సవాలు**

**గర్భాలయంలోని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నేడు ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ వరకు జరుగుతాయి. ఆలయ గోపురానికి బంగారు తాపడం అనంతరం వచ్చిన బ్రహ్మోత్సవాలు ఇవి. ఈ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. మొదటిరోజు శ్రీ విష్వక్సేనారాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం పూజలు, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదట గర్భాలయంలోని స్వయంభు నారసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

## సైనిక్ స్కూల్ తరహాలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్


**దేశానికే రోల్ మోడల్‌గా నిలవాలి .. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్ష**

**స్కూల్ బ్రోచర్, వెబ్‌సైట్ ఆవిష్కరణ .. 31న స్కూల్‌ను ప్రారంభించనున్న సీఎం**



హైదరాబాద్: సైనిక్ స్కూళ్ల తరహాలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను కూడా దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు. విద్యా విధానంలో కొత్త ఒరవడిని అవలంబించాలని, క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో పోలీస్, యూనిఫామ్ సర్వీస్ ఉద్యోగుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నెలకొల్పాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ స్కూల్ బ్రోచర్, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. స్కూల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్టు

(మిగతా 2వ పేజీలో)




## ఈసారి మంటలే.. మించిపోనున్న వేసవి ఉష్ణోగ్రతలు

**రాష్ట్రంలో సాధారణాన్ని మించిపోనున్న వేసవి ఉష్ణోగ్రతలు**

**వరుసగా ఎక్కువ రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే చాన్స్**

హైదరాబాద్: రాష్ట్రంలో ఈసారి ఎండలు మండిపోనున్నాయి. వడగాడ్పులూ తీవ్రరూపం దాల్చనున్నాయి. ఈ వేసవి సీజన్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. దేశవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు 2025 మార్చి నుంచి మే నెల వరకు వేసవి సీజన్‌కు సంబంధించిన అంచనాలను శనివారం హైదరాబాద్ వాతావరణ కేంద్రం విడుదల చేసింది. ఈ ఎండాకాలంలో వరుసగా ఎక్కువ రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. సాధారణంగా వేసవిలో నాలుగైదు రోజుల పాటు సాధారణం కంటే

(మిగతా 2వ పేజీలో)

# 24 గంటల్లో బయటికి!



సుమారు 18 అడుగుల ఎత్తులో, 200 మీటర్ల వరకు మట్టి, బురద, శిథిలాలు పేరుకుని ఉన్నాయి. అందులో కాంక్రీట్ సెగ్మెంట్లు, టీబీఎం భాగాలు, రాళ్లు, మట్టి కాకుండా అసాధారణ అవశేషాలు ఉన్న స్పాట్లను జీపీఆర్ గుర్తించింది. ఆయా చోట్ల మ్యాన్యువల్‌గా తవ్వకాలు చేపట్టగా.. తవ్విన కొద్దీ ఏర్పడుతున్న బురద, ఊట నీటితో ఇబ్బంది ఎదురవుతోంది. సొరంగంలో నిమిషానికి సుమారు 5 వేల లీటర్ల సీపేజీ వస్తుండటంతో పది పంపులతో డీవాటరింగ్ పనులు చేపడుతున్నారు. హైడ్రాకు చెందిన మినీ డోజర్‌తో బురదను తొలగిస్తున్నారు. కన్వేయర్ బెల్టు మరమ్మతుకు మరో 2 రోజులు: సొరంగంలో 13 కిలోమీటర్ల వరకే లోకో ట్రైన్ వెళ్లగలుగుతోంది. అక్కడి నుంచి మినీ డోజర్ ద్వారా బురద, మట్టి తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. ప్రమాద స్థలానికి ముందు 200 మీటర్ల వరకు చేరుకునేందుకు రెస్క్యూ సిబ్బంది సిద్ధం చేసిన ఫ్లోటింగ్ బెల్టు మీదుగా నడిచి వెళుతున్నారు. ఈ శిథిలాలు, మట్టి తొలగించేందుకు కన్వేయర్ బెల్టు అందుబాటులోకి రాక ఆలస్యం అవుతోంది. కన్వేయర్ బెల్టు ఎండ్ పార్ట్ వద్ద మెషీన్ పూర్తిగా ధ్వంసం కావడం, బెల్టును తిరిగి వినియోగంలోకి తేవాలంటే కొత్త ఫౌండేషన్ వేయాల్సి ఉండటంతో.. ఇందుకోసం మరో రెండు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ..**

సహాయక చర్యల్లో ఆధునిక సాంకేతికతను, పరికరాలను వినియోగిస్తున్నారు. శిథిలాల్లో అవశేషాలను గుర్తించేందుకు గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్), మానవ రక్తం ఆనవాళ్లను గుర్తించే ఆక్వా–ఐ, ప్రోబోస్కోప్, టీబీఎం విడిభాగాలు, శిథిలాలను కట్ చేసేందుకు అల్ట్రా థర్మికల్ కటింగ్ మెషీన్, ప్లాస్మా కట్టర్స్, సొరంగంలోని బురద, మట్టిని తొలగించేందుకు ఆర్మీకి చెందిన రెండు మినీ బాబ్ క్యాట్ మెషీన్లు, ఎస్కవేటర్‌ను వినియోగిస్తున్నారు. టన్నెల్ లోపల సహాయక చర్యలను ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్ఎఫ్ ఐజీ మోహ్సెన్ షహది పర్యవేక్షిస్తున్నారు. శనివారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ, ఎన్‌జీఆర్ఐ నిపుణులతో సమీక్షించారు.

**డాక్టర్‌గా చెబుతున్నా.. వాళ్లు బతికుండే అవకాశం లేదు: ఎమ్మెల్యే వంశీకృష్ణ**

సొరంగంలో కార్మికులు మట్టి, బురద, శిథిలాల కింద కూరుకుపోయారని.. ఒక డాక్టర్‌గా చెబుతున్నానని, వాళ్లు బతికి ఉండేందుకు అవకాశం లేదని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. కార్మికులను బయటికి తీసేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామని.. ఒకట్రెండు రోజుల్లో బయటికి తీసే అవకాశం ఉందని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సొరంగంలో కుప్పకూలిన ప్రాంతానికిపైన భూఉపరితలం వద్ద 'నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ)' అధికారులు సర్వే చేపట్టారు. ఈ ప్రాంతానికి సమీపంలో మల్లెల తీర్థం జలపాతం ఉండటం, దానికి నల్లవాగు (ఏనిగే)కు మధ్యలో సుమారు 400 మీటర్ల లోతున టన్నెల్‌లో ప్రమాదం జరగడంతో... టన్నెల్‌లో భారీగా నీటి ఊటకు కారణాలపై పరిశీలన చేపట్టారు. అయితే ఎన్జీఆర్ఐ పరికరాల ద్వారా 150 మీటర్లలోతు వరకు మాత్రమే మట్టి పొరలు, రాళ్ల ఆకృతుల వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. సొరంగం 400 మీటర్ల లోతులో ఉన్న నేపథ్యంలో... పరిశోధించేందుకు 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ)' చెందిన నిపుణులు ఆదివారం రంగంలోకి దిగనున్నారు.

**వెళ్లి చూస్తే పరిస్థితి ఎంత క్లిష్టమో తెలుస్తుంది: మంత్రి జూపల్లి కృష్ణారావు**

సొరంగంలో చిక్కుకున్న 8 మందిని బయటికి తీసే చర్యల్లో పురోగతి కనిపించిందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శనివారం దోమలపెంట సొరంగం వద్ద మంత్రి ఉత్తమ్‌తో కలసి అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. లోపల చిక్కుకున్న కార్మికులు బతికి ఉండే అవకాశం 99శాతం లేదన్నారు. రెస్క్యూ బృందాలు ప్రమాదంలో పడొద్దన్న ఉద్దేశంతో జాగ్రత్తగా పనులు చేపడుతున్నామని, అందుకే ఆలస్యం అవుతోందని జూపల్లి తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యమంటూ విమర్శలు చేస్తున్నవారు ఒకసారి టన్నెల్‌లో ప్రమాదస్థలానికి వెళ్లి చూస్తే.. పరిస్థితి ఎంత కష్టంగా ఉందో తెలుస్తుందని పేర్కొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన బిజెపి నేతలు

హైదరాబాద్, వార్త మిర్రర్ ప్రతినిధి : బింగి కృష్ణ గౌడ్, శైలజ ల కుమారుడు బింగి ప్రవీణ్ గౌడ్, ప్రత్యూష ల వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడకలకు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడు కొయ్యాడ నర్సింగ్ గౌడ్ ఆహ్వానం మేరకు గోషామహల్ ఇన్చార్జి మధుసూదన్, లతా తదితరులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో కొయ్యడ నర్సింగ్ గౌడ్, శోభారాణి గౌడ్, నివేదిత, నమ్రత, శ్యాం కుమార్, బాలకృష్ణ గౌడ్, లక్ష్మి, రాజు, కౌసల్య తదితరులు పాల్గొని నూతన వధూవరులను అభినందించి, ఆశీర్వచనాలను తెలియజేశారు.

# ఇక క్రమం తప్పకుండా కార్యకర్తలను కలుస్తా

అగ్రభాగాన నిలబెట్టా. 2004లో ఓడిపోయాక అధికారంలోకి రావడానికి 10 ఏళ్లు పట్టింది. మళ్లీ 2014లో చాలా సమస్యలు వచ్చాయి. రెండు రాష్ట్రాల్లో పార్టీని కాపాడుకోవడం చారిత్రాత్మక అవసరం. కానీ సమైక్య ముసుగులో వైసీపీ విభజన కోరుకుంది. అయినా ప్రజలు విజ్ఞతతో ఆలోచించి మనల్ని గెలిపించారు. 2014–2019 మధ్య అవిశ్రాంతంగా పనిచేసి 13.5 గ్రోత్‌రేట్ సాధించాం. ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందంటే దానికి కారణం ప్రజలకు మంచి చేయకపోవడం వల్ల కాదు... కార్యకర్తల్లో అసంతృప్తి వల్లే. మీలో అనువణువు పసుపు రక్తం తప్ప మరొకటి ఉండదు. మీతో నేను మాట్లాడకుంటా ఉంటే మీరు కూడా నాపై అసంతృప్తిలో ఉంటారు. అందుకే కార్యకర్తల కోసం సమావేశం ఏర్పాటు చేశాను.

**నాకు, కార్యకర్తలకు మధ్య దూరం ఉండదు**

మునుపు ఎన్నికలయ్యాక కేడర్ కోసం ఆలోచించలేకపోయాం. కానీ ఈసారి కార్యకర్తలకు, నాకు గ్యాప్ ఉండదు. పర్యటనకు వెళ్లిన ప్రతిచోటా కార్యకర్తలు, నేతలతో సమావేశమవుతా. ప్రభుత్వంలో ఉన్న మనం ప్రజల కోసం ఏం చేస్తున్నామో చెప్పడానికి కూడా సోషల్ మీడియా ఒక ఆయుధం...ప్రజలకు సమాచారం త్వరగా చేరవేయడంలో కీలకంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలి.

**వారికి మేలు చేస్తే పాముకు పాలు పోసినట్టే**

వైసీపీ నేతలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపకారం చేసే పరిస్థితి ఉండకూడదు. ఈ విషయం నేతలకు నేరుగా, గట్టిగా చెబుతున్నా. వైసీపీకి ఉపకారం చేస్తే పాముకు పాలు పోసినట్లే. శ్రేణులు కూడా ఎవరి ఇష్టం వచ్చినట్టు వారు కాకుండా నాయకత్వం కింద పనిచేయాలి. ఎమ్మెల్యేలు, ఎంపీలు వన్ టైంగా చూసుకోవద్దు. మీరు రాజకీయాల్లో ఉన్నన్నాళ్లు ప్రజాప్రతినిధులుగా ఉండాలి. కార్యకర్తలకు మీరు అండగా ఉండాలి, అందుబాటులో ఉండాలి. నాకు ఎన్ని పనులున్నా ఎక్కడికెళ్లినా కార్యకర్తలను కలవడం బాధ్యతగా పెట్టుకుంటా. మొన్నటి ఎన్నికల్లో నా మిత్రులను కూడా పక్కనబెట్టా. అవసరమైతే మీతో కలిసి టీ తాగుతా, భోజనం చేస్తానని చెప్పాగానీ పార్టీని త్యాగం చేయనని నా మిత్రులకు స్పష్టంగా చెప్పాను" అని చంద్రబాబు వివరించారు.



# నేటి యువతకు మీనాక్షి నటరాజన్ ఆదర్శం

### ఇక రాష్ట్ర రాజకీయాల్లో నూతన శకం ప్రారంభం: కేఎల్ఆర్

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( ధనుంజయ్ నేత ) ..మార్చి : 1 ...నేటి రాజకీయ నేతలకు నూతన రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ఆదర్శంగా నిలుస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ నేత, మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కొనియాడారు. గాంధీభవన్ లో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ... హంగు ఆర్భాటాలకు దూరంగా ఉండే నేటి నాయకులుకు భిన్నంగా ఆమె ఉండి... అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. మీనాక్షి నటరాజన్ రాకతో తెలంగాణలో కాంగ్రెస్ మరింత బలోపేతం అయ్యేందుకు దోహద పడుతుందన్నారు. యువత, మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లో రావాలని పిలుపునిచ్చారు. ఫ్లెక్సీల్లో కాదు – జనంలో ఉండాలన్న మీనాక్షి నినాదం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహనిస్తుందని కేఎల్ఆర్ అన్నారు.

# 12 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు?

హైదరాబాద్: ఈ నెల 12వ తేదీ నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నట్లు సమాచారం. 12వ తేదీన ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. 15వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది. మార్చి చివరి వారంలో సీఎం రేవంత్‌రెడ్డి బృందం ఢిల్లీకి వెళ్లనుంది. ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులను రాష్ట్ర ప్రభుత్వ బృందం కలవనుంది. కాగా, తెలంగాణ సర్కార్ శనివారం.. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున కొత్త పథకాలను ప్రారంభించనుంది. పరేడ్ గ్రౌండ్‌లో మహిళా సంఘాలచే ఆర్టీసీ అద్దె బస్సులు– మొదటి విడతలో 50 బస్సులకు పచ్చ జెండా ఊపి సీఎం ప్రారంభించనున్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు చెల్లింపు, 31 జిల్లాల్లో మహిళా సంఘాలచే పెట్రోల్ బంకుల ఏర్పాటు కోసం అయిల్ కంపెనీలో ఒప్పందాలు, 32 జిల్లాల్లో జిల్లాకు 2 మెగా వాట్ల చొప్పున 64 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లకు వర్చువల్‌గా సీఎం శంకు స్థాపన చేయనున్నారు. 14 వేల అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నియామక నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేయనుంది. ఇదిలా ఉండగా, ఇసుకతో పాటు ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు, అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. గనుల శాఖపై శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమని, ప్రభుత్వానికి ఆదాయం పెంచగలమన్నారు. ప్రభుత్వంలోని నీటి పారుదల, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల




ఆధ్వర్యంలో చేప్టటే పనులకు టీజీఎండీసీ నుంచే ఇసుక సరఫరా చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పెద్ద మొత్తంలో నిర్మాణాలు చేపట్టే నిర్మాణ రంగ సంస్థలకు అవసరమైన ఇసుకను టీజీ ఎండీసీ ద్వారానే సరఫరా చేయాలన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీప ప్రాంతాల్లోనే ఇసుక ఎక్కువగా వినియోగం జరుగుతోందని.. తక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన వారు కొనుగోలు చేసేలా నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. గనుల శాఖ పరిధిలోని వివిధ ఖనిజాల క్వారీలకు గతంలో విధించిన జరిమానాలు, వాటి వసూళ్లపైనా అధికారులను సీఎం ప్రశ్నించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మైనర్ ఖనిజాల బ్లాక్‌ల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు.

# అందుకే నాపై విమర్శలు.. రేవంత్‌కు కిషన్‌రెడ్డి కౌంటర్



హైదరాబాద్: పద్నాలుగు నెలల్లో ఆరు గ్యారంటీలు అమలు అయ్యాయా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని దుయ్యబట్టారు. శనివారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, అనేక రకాల హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. గతేడాది డిసెంబర్‌లోపు ఇస్తామన్న 2 లక్షల ఉద్యోగాలు ఏవి?. ఇళ్లులేని వారందరికీ రూ.5 లక్షలు, ఇంటి స్థలం ఇస్తామన్నారు.. ఏమైంది?" అంటూ కిషన్‌రెడ్డి నిలదీశారు. "బాధ్యతలు, హామీలను విస్మరించి సీఎం గాలి మాటలు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ గెలిపించి మోసపోయామని ప్రజలు అనుకుంటున్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయలేక సీఎం రేవంత్‌రెడ్డి నాపై విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలే సీఎం అసహనానికి కారణం. రేవంత్‌రెడ్డి తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నాం. నేను బెదిరింపు రాజకీయాలు చేస్తున్నానన్నది అవాస్తవం. సీఎం రేవంత్ దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారు" అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.




# ఎల్ఆర్ఎస్‌కు ఐదంచెల 'చెక్‌లిస్ట్'

### 10 శాతం ప్లాట్ల ఈసీలు చెక్ చేయాల్సిందే
### లేఅవుట్ లేదా ప్లాట్ యజమాని డిక్లరేషన్ ఉంటేనే రిజిస్ట్రేషన్
### ఎల్ఆర్ఎస్ నంబర్, డబ్బు చెల్లింపు రసీదును పరిశీలించాకే తుది నిర్ణయం
### సబ్‌రిస్ట్రార్లకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాలు

హైదరాబాద్: అనధికార లేఅవుట్లలో ప్లాట్ల క్రమబద్ధికరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిన ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా రిజిస్ట్రేషన్లు చేసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్లందరికీ ఆ శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ సర్క్యులర్ పంపారు. ఈ సర్క్యులర్ ప్రకారం ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు ఐదంచెల చెక్‌లిస్ట్‌ను పాటించాల్సి ఉంటుంది. ఈ చెక్‌లిస్ట్‌లోని అంశాలను లేఅవుట్ లేదా ప్లాట్ యజమాని ధ్రువీకరించాల్సి ఉంటుంది. ముందుగా ఆ లేఅవుట్‌లో 2020, ఆగస్టు 26 నాటికి 10 శాతం మేర ప్లాట్ల విక్ర యాలు జరిగాయని నిర్ధారించుకునేందుకు గాను ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ల(ఈసీ)ను చెక్ చేయాలి. అదే విధంగా ప్రత్యేక ఫార్మాట్‌లో ఆ 10 శాతం ప్లాట్ల వివరాలను ఇవ్వాలి. 10 శాతం ప్లాట్లు అమ్మిన అనంతరం లేఅవుట్ ప్లాన్ చెక్ చేయాలి. వీటితో పాటు ప్లాట్ లేదా లేఅవుట్ యజమానికి డిక్లరేషన్ ఇవ్వాలి. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు నంబర్‌తో పాటు ప్లాటు యజమాని ప్రభుత్వానికి చెల్లించిన మొత్తానికి రసీదును పరిశీలించిన అనంతరం రిజిస్ట్రేషన్ చేయాలా వద్దా అన్న దానిపై సబ్ రిజిస్ట్రార్లు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

**లేఅవుట్ యజమానులు ఇవ్వాల్సిన**

**ప్రత్యేక ఫార్మాట్‌లో పొందుపర్చాల్సిన వివరాలివే..**

జిల్లా, మండలం, గ్రామం, సర్వే నంబర్, లేఅవుట్ విస్తీర్ణం, లేఅవుట్‌లోని మొత్తం ప్లాట్లు, క్రయ, విక్రయ లావాదేవీలు జరిగిన 10 శాతం ప్లాట్లకు సంబంధించి ప్లాట్ల నంబర్లు, రిజిస్టర్ డాక్యుమెంట్ నంబర్లు, సంవత్సరం, ఏ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీ జరిగింది అనే వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది.

# విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయాలి

**- సైన్స్ ఫెయిర్ తో విద్యార్థుల్లోసృజనాత్మక ను పెంపొందిస్తే కొత్త ఆవిష్కరణలు జరుగుతాయి.**

**- పిల్లల్లో మానసిక వికాసానికి సైన్స్ ఫెయిర్ లాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయి**

**- టాస్క్ - సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**





కల్వకుర్తి అమనగల్ మార్చ్ 1 వార్త మిర్రర్ ప్రతినిధి:– అమనగల్ పట్టణ కేంద్రంలోని అరబిందో హై స్కూల్ లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డివిద్యార్థులు సొంతంగా తయారు చేసిన పలు సృజనాత్మక ప్రాజెక్టు వర్క్ ను పరిశీలించి,వాటి పనితీరు ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు సొంతంగా తయారు చేసిన ప్రాజెక్ట్స్ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని,ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత నైపుణ్యం పెంపొందించడంతో కొత్త కొత్త ఆవిష్కరణలు జరుతుతాయని,పిల్లల్లో మనో వికాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని,ఇంత మంచి కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు అలాగే ఇలాంటి మరెన్నో కార్యక్రమాలతో విద్యార్థుల్ని ప్రోత్సహిస్తున్న అరబిందో స్కూల్ యాజమాన్యానికి ఈ సంధర్బంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సాయిరాం మెడికల్ పాపిశెట్టి రాము గారు,పాఠశాల కరెస్పాండంట్ సుధీర్ రెడ్డి, ట్రస్మా సభ్యులు అల్లాజీ, శ్రీరామ్, శివలింగం, మహమ్మద్, నిరంజన్, సుదర్శన్, శ్రీను, వెంకటేష్, సంజయ్, మరియు పాఠశాల బృందము భాస్కర్, నరేష్, నజీర్,హైమావతి, రాధా, సునీత,సౌజన్య, సౌమ్య, స్వప్న మొదలగు అధ్యాపకులతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి భక్తులకు గుడ్‌న్యూస్

**యాదగిరి బ్రహ్మోత్సవాల సందర్భంగా కేంద్రమంత్రి కీలక ప్రకటన**





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

తెలంగాణలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మినర్సింహ్మా స్వామి వారి ఆలయం ఒకటి. తెలంగాణ తిరుపతిగా ఈ ఆలయానికి పేరుంది. రాష్ట్రంలో ఎక్కువ మంది భక్తులు సందర్శించే ఆలయం యాదగిరిగుట్ట. నిత్యం వేల సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించి మ్రొక్కులు చెల్లించుకుంటారు. ఇటీవల దేశంలోనే ఎత్తైన స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరించారు. దీంతో భక్తుల రద్దీ పెరిగింది. అయితే ప్రస్తుతం ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు ప్రైవేటు వాహనాలు, బస్సుల్లో ఆలయానికి వస్తున్నారు. ప్రస్తుతానికి ట్రైన్ కనెక్టివిటీ అంతగా లేదు. ఈ నేపథ్యంలో భక్తులకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుడ్‌న్యూస్ చెప్పారు.త్వరలోనే యాదగిరి గుట్ట ఆలయానికి ట్రైన్‌లో జర్నీ చేసే అవకాశం కలగనుంది.యాదగిరిగుట్ట భక్తుల సౌకర్యార్థం రైల్వే శాఖ రూ.24.45 కోట్లతో యాదాద్రి (రాయగిరి) రైల్వేస్టేషన్‌ను పునరాభివృద్ధి చేస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం చిన్నగా ఉన్న పాత స్టేషన్ స్థానంలో విశాలమైన నూతన స్టేషన్ భవనం, ప్లాట్‌ఫారాలను నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అమృత్ భారత్ పథకం కింద దేశంలో అనేక రైల్వే స్టేషన్లను అత్యద్భుతంగా అభివృద్ధి చేస్తుండగా.రాయగిరి స్టేషన్‌కు పునారాభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 38 శాతం పనులు పూర్తయ్యాయని కిషన్ రెడ్డి వెల్లడించారు. అమృత్ భారత్ పథకం కింద పనులు ప్రారంభమయ్యాయని త్వరలోనే పూర్తి చేసి కొత్త ట్రైన్లు నడపనున్నట్లు వెల్లడించారు. ఈ స్టేషన్, కొత్త ట్రైన్లు అందుబాటులోకి వస్తే భక్తులు తక్కువ సమయంలోనే ఆలయాన్ని దర్శించుకునే వీలుంది.ఇక ఎంఎంటీఎస్ విస్తరణలో భాగంగా రాయగిరి వరకు ట్రైన్లు నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. హైదరాబాద్ శివారు ఘట్కేసర్ వరకు ప్రస్తుతం ఎంఎంటీఎస్ ట్రైన్లు నడుస్తుండగా.అక్కడి నుంచి రాయగిరి స్టేషన్ వరకు విస్తరించాలని భావిస్తున్నారు. గతంలోనే ప్రతిపాదనలు రాగా. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు సైతం పట్టాలెక్కితే కేవలం 40 నిమిషాల్లోనే 25 ఛార్జీతో హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట ఆలయానికి చేరుకోవచ్చు. దీని ద్వారా సమయంతో పాటు డబ్బులు కూడా ఆదా కానున్నాయి.

# గౌడ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని

**టీ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు-తెలంగాణ**

**గౌడ సంఘం నాయకుల వినతి**



హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

తెలంగాణ గీతా కార్మికుల సంక్షేమం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ. గీత కార్మికుల ప్రమాదాల నివారణ కోసం గౌడ్స్ కులదైవం కాటమయ్య పేరుతో చేపట్టిన కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ మూకులు) పంపిణీ చేయడం నిజంగా చారిత్రాత్మకం అన్నారు. తెలంగాణ గౌడ సంఘం నాయకులు పల్లె లక్ష్మణరావు గౌడ్, బద్దం ధనుంజయ్ గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘం నాయకులతో కలిసి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు దృష్టికి తీసుకొచ్చారు. గౌడ కుల సమస్యలను గీతా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. గౌడ్స్ ఆత్మ గౌరవానికి ప్రత్యేకగా నిలిచిన నెక్లెస్ రోడ్ లోనిర్మించిన నీరా కేఫ్ నీ ఇతరులకు లీజ్ కు ఇచ్చే విషయం వెనక్కి తీసుకోవాలని అన్నారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న గీతా కార్మికులకు అందజేసే పది లక్షల ఎక్స్రేషియా పెంచి. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ట్యాంక్ బండపై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, కోకాపేటలో గౌడ్స్ కోసం కేటాయించిన ఐదు ఎకరాల భూమికి సంబంధించి కొత్త కమిటీని ఏర్పాటు చేసి వెంటనే భవనం నిర్మించాలని కోరారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించి, గౌడ సమస్యలను గీత కార్మిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# అంగరంగ వైభవంగా సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ 14 వ వార్షికోత్సవ వేడుకలు




శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శనివారం శిల్ప కళా వేదికలో అంగరంగ వైభవంగా జరిగిన సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ 14వ వార్షికోత్సవ వేడుకలసంబురాలు. విచ్చేసినఅతిరథ మహారథులు, ప్రముఖులు, నాయకులు, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు.అలరించిన సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ విద్యార్థిని, విద్యార్థుల సాంస్కృతిక నృత్య, కళా ప్రదర్శనలు.అతి తక్కువ ఫీజులతో, అన్ని తరగతుల కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్యను అందిస్తూ, దినదినాభివృద్ధి చెందుతూ, అందరి మన్ననలు పొందుతూ, చుట్టూ ప్రక్కల మంచి స్కూల్స్ గా పేరు గాంచిన సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ నేడు 14వ వార్షికోత్సవ సంబురాలు జరుపుకుంది. సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ 14వ వార్షికోత్సవ వేడుకలకు మాదాపూర్ లోని శిల్పకళా ఆడిటోరియం వేదికగా మారింది. ఈ వేడుకలకు మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ , పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ , సెంట్రల్ సంగీత్ నాటక్ అకాడమీ అవార్డి చైర్ పర్సన్, ప్రొఫెసర్ అలేఖ్య పంజాల , కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ , శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ , స్థానిక నాయకులు, ప్రముఖులు విచ్చేసారు. ఈ సందర్బంగా సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ మంగలారపు లక్ష్మణ్ విచ్చేసిన ప్రముఖులకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి, శాలువాతో సన్మాంచి, మెమోంటోతో సత్కరించారు. అనంతరం సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ యొక్క విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక, నృత్య, కళా ప్రదర్శనలు విచ్చేసిన అహుతులను, ప్రముఖులను, నాయకులను, తల్లిదండ్రులను ఎంతో ఆకట్టుకున్నాయి.ఈ సందర్బంగా విచ్చేసిన ప్రముఖులు సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ యొక్క విద్యార్థిని, విద్యార్థులు ఈ 14 సంవత్సరాలలో సాధించిన విజయ ప్రస్థానాలను కొనియాడారు. విద్యార్థులను ఎటువంటి ఒత్తిడికి గురి చెయ్యకుండా, వారికీ అర్థం అయ్యేట్టుగా విద్య భోధన చెయ్యటంలో సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ నూతన ఒరవడిని సృష్టించిందని అన్నారు. నేటి రోజులలో అతి తక్కువ ఫీజులతో, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిచటం అంటే కత్తి మీద సామేనని అన్నారు. కానీ సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ మంగళరాపు లక్ష్మణ్ విద్యా విధానంలోను, స్కూల్ ఫీజుల విషయంలోను, చరిత్ర సృష్టించిరాని అన్నారు. ముఖ్యంగా అన్ని తరగతి కుటుంబాలకు అందుబాటులో విద్యను అందించాలని, ఎవరికి సాధ్యం కానీ అతి తక్కువ ఫీజులతో, ఉన్నత విద్యను అభ్యసించిన సిబ్బందితో ఈ సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ నడపటం చైర్మన్ మంగళరాపు లక్ష్మణ్ దృఢ సంకల్పాన్ని తెలియజేస్తుందని అన్నారు. సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని అత్యున్నత శిఖరాలు చేరుకోవాలని విచ్చేసిన పెద్దలు ఆకాంక్షించారు.సంస్కృతి గ్రూప్ అఫ్ స్కూల్స్ 14వ వార్షికోత్సవ వేడుకల్లో సీనియర్ నాయకులు పేరుక రమేష్ పటేల్, ఏ.శ్రీనివాస్ యాదవ్, రాజు యాదవ్, శ్రీనివాస్ చౌదరి, మంగళరాపు తిరుపతి, బుడుగు తిరుపతి రెడ్డి, చింతల రాజు యాదవ్, పలువురు ప్రము ఖులు, దాదాపుగా 15 వందల మంది విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్ పో

కొండాపూర్ వార్త మిర్రర్ :జాతీయ సైన్స్ డే సందర్భముగా మాదాపూర్ లోని ఎస్ అర్ డి జీ పాఠశాల లో ఘనంగా సైన్స్ ఎక్స్ పో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శంషాబాద్ జోనల్ కో ఆర్డినేటర్ సుచరిత విచ్చేచి, విద్యార్థులు సృజనాత్మకతతో, ఆలోచన విధానం ద్వారా ప్రదర్శించిన మోడల్స్ ను తిలకించి విద్యార్థులను అభినందించారు. నేటి రోజుల్లో సైన్సు, సాంకేతిక ప్రాధాన్యతను వివరి%శీ%చారు. విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప శాస్త్ర వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.చిన్నారులు ప్రదర్శించిన వాటర్ ఫ్యూరి పయిర్, బ్లెడ్ గ్రూప్ టెస్ట్ వంటివి ఎంతో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.చిన్ని, పాఠశాల ఉపాధ్యాయులు, భోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొని చిన్నారుల ను అచినందించారు.



## సూపరిండెంట్ కు సన్మానం

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :

బి హెచ్ ఈ ఎల్ జెనరల్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ గా పదోన్నతి పొందిన డాక్టర్ అలోక్ కుమార్ పట్నాయక్ కు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. సన్మానం జరిపిన వారిలో రిటైర్డ్ సీనియర్ మేనేజర్ ఏ. యాదయ్య,, మాజీ కౌన్సిలర్, రిటైర్డ్ ఇంజనీర్ గుబ్బపు రవీందర్ రావు, రిటైర్డ్ సీనియర్ అస్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివ ప్రసాద్, రిటైర్డ్ ఎంప్లాయిలు గాంధీ చౌదరి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షులు సతీష్ కుమార్ జన్మదిన వేడుకలు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : వీధి వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ కుమార్ జన్మదిన సందర్భంగా రాజు రజక ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు ఘనంగా శాలువా తో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సతీష్, రాజు రజక, సోమేష్ , లూథియా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ- ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్ పో

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి మండల పరిధిలోనీ నల్లగండ్ల శ్రీ చైతన్య పాఠశాలలో ప్రముఖ శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ జన్మదినం సందర్భంగా సైన్స్ ఎక్స్ పో కార్యక్రమం నిర్వహించారు. డి ఆర్ డి ఓ శాస్త్రవేత్తలు మంగతాయారు, సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా విచ్చేశారు. విద్యార్థులు వినూత్నముగా 90 కు పైగా ప్రాజెక్టులను రూపొందించారు. వాటిలో వర్కింగ్ మోడల్ అఫ్ ఫోటో సింథసీస్, వర్కింగ్ మోడల్ అఫ్ బ్రెయిన్, ఏపీతీలియన్ టిష్యూస్, చంద్రయాన్ –3, కార్బన్ ప్యూరిఫికేషన్, డిస్టిలేషన్, డునాట్ టచ్ ధిస్ కెమికల్ ( మాంగనీస్ హెప్టాక్సైడ్ ), హైడ్రాలిక్ పాస్ యూజింగ్ పాస్కల్స్ లా, సోలార్ కార్ వంటి ప్రాజెక్టులతో పాటు ప్రైమరీ విద్యార్థులు రూపొందించిన హైడ్రో ఎలక్ట్రిసిటీ, డ్రిప్ ఇరిగేషన్, సర్క్యులేటరీ సిస్టమ్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, రీప్రొడక్షన్ ఇన్ ఏనిమల్స్, వాటర్ ప్యూరిఫికేషన్, వంటి ప్రాజెక్టులు చూపరులను ఆకట్టుకున్నాయి. అయోధ్య రామాలయం వంటి మోడల్స్, భారతీయ సంస్కృతిని, చరిత్రను తెలిపుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యఅతిథి సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసిలా మేధోశక్తిని పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, అందుకు శ్రీ చైతన్య విద్యాసంస్థలను అభినందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చేసే ప్రాజెక్టును పరిశీలించి వారి ప్రతిభకు ముగ్ధుడిని అయ్యానని విద్యార్థులను కొనియాడారు. మీ తెలివి తేటలు దేశాభివృద్ధికి దోహదపడాలని హితవు పలికారు. పాఠశాల ప్రిన్సిపల్ యు. వాణి మాట్లాడుతూ చదువు, ఆటలతో పాటు విద్యార్థుల నైపుణ్యమును, సృజనాత్మకతను వెలికి తీసి వారి సర్వతోముఖాభివృద్ధిలో తాము భాగస్వాములం అయినందుకు గర్వకారణంగా ఉందని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలలో విద్యార్థులందరూ పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కృషిచేసిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చివరగా ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణిలో నిలిచిన ప్రాజెక్టులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ నాగరాజు, ఇన్చార్జెస్ శ్రీలక్ష్మి, యం. కె. రంగ, ప్రైమరీ ఇన్చార్డ్ అమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గౌడ్స్ ఆత్మ గౌరవానికి ప్రతీక అయినా నిరా కేఫ్ ని లీజుకి ఇచ్చే విషయం వెనక్కి తీసుకోవాలి

**గీత కార్మికులకు అందజేసే ఎక్స్గ్రేషియా 10 లక్షల పెంచి పెండింగ్ బకాయిలను వెంటనే అందజేయాలి**

**బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు-తెలంగాణ గౌడ సంఘం నాయకుల వినతి**





హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి తెలంగాణ గీతా కార్మికుల సంక్షేమం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ. గీత కార్మికుల ప్రమాదాల నివారణ కోసం గౌడ్స్ కులదైవం కాటమయ్య పేరుతో చేపట్టిన కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ మూకులు) పంపిణీ చేయడం నిజంగా చారిత్రాత్మకం అన్నారు. గౌడల తరఫున ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ. అలాగే మరికొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని. బీసీ సంక్షేమ శాఖ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు దృష్టికి తీసుకొచ్చారు. గౌడ్స్ ఆత్మ గౌరవానికి ప్రత్యేకగా నిలిచిన నెక్లెస్ రోడ్ లోనిర్మించిన నీరా కేఫ్ నీ ఇతరులకు లీజ్ కు ఇచ్చే విషయం వెనక్కి తీసుకోవాలని అన్నారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న గీతా కార్మికులకు అందజేసే పది లక్షల ఎక్స్గ్రేషియా పెంచి. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ట్యాంక్ బండపై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, కోకాపేటలో గౌడ్స్ కోసం కేటాయించిన ఐదు ఎకరాల భూమికి సంబంధించి కొత్త కమిటీని ఏర్పాటు చేసి వెంటనే భవనం నిర్మించాలని కోరారు. బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సానుకూలంగా స్పందించి, తెలంగాణ గౌడ సంఘం నాయకులు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ బద్దం ధనంజయ గౌడ్ పైన తెలిపిన విషయాలపై స్పందిస్తూ నీరా కేఫ్ విషయం ఆత్మ భవనం విషయంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేను ముఖ్యమంత్రితో మాట్లాడమని అన్నారు మార్చిలో గౌడ ఆత్మగౌరవ భవనం పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ట్యాంక్ బండ్లపై సర్వాయి సర్దార్ పాపన్న విగ్రహాన్ని స్థలం చూసి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మీరా కేఫ్ విషయంపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో టూరిజం ఎండి ప్రకాష్ రెడ్డి తో సమావేశం ఏర్పాటు చేశామని కులానికి సంబంధించిన వ్యక్తులుగా బాధ్యత వహిస్తున్నామని రైట్స్ అన్ని సొసైటీకే ఇచ్చే ప్రయత్నం చేస్తామని అన్నారు. గౌడ సామాజిక వర్గానికి, గీత కార్మికులకు గాని ఎలాంటి అపోహలు అవసరం లేదు. గౌడ ప్రతినిధులుగా ప్రభుత్వంలో నేను టిపిసిసి చైర్మన్ మహేష్ గౌడ్, మధుయాష్కికి గౌడ్, ప్రభుత్వంలో చాలామందిని ఉన్నాము అధైర్య పడొద్దు అని హామీ ఇచ్చారు పొన్నం ప్రభాకర్ గౌడ్

# అలరించినా వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు.



మాదాపూర్ వార్త మిర్రర్ : మాధాపూర్ లో ని శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కథక్ మరియు భరతనాట్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. బెంగళూరు నుండి విచ్చేసి న కథాకా కళాకారిణి కుమారి అమ్రితా బనెర్జీ కథక్ నృత్య ప్రదర్శనలో శివ వందన, తాల్ ధంగార్, లపక్ ఝూపక్ – తుమ్రి అంశాలను ప్రదర్శించి మెప్పించారు. భరతనాట్య ప్రదర్శనలో శ్రీమతి వంశీ మాధవి బృందం గోపిక, అర్చిష్మాతే , గాయత్రీ , జాహ్నవి మరియు నైనికా అంశాలను పుష్పాంజలి, అలరిపు, దశావతార,తీరు పల్లాండు, తక్కువేమి మనకు, పదం, తిల్లాన ప్రదర్శించి మెప్పించారు.

# కల్వకుర్తిలోని ఫుట్ పాత్ షాపుల పంపిణీలో పూర్తి పారదర్శకత వహించాలి

- అసంపూర్తిగా వదిలేసిన పనులు వెంటనే పూర్తి చేయాలి
- స్థానిక చిరువ్యాపారులకే షాపులు కేటాయించాలి
- దరఖాస్తుల చివరి తేదీ పొడగించాలి.
- కల్వకుర్తి పట్టణ బిజెపి అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్





కల్వకుర్తి మార్చ్ 1 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి మున్సిపాలిటీలోని జూనియర్ కళాశాల ఎదురుగా చిరు వ్యాపారస్తుల కొరకు నిర్మించిన ఫుట్ పాత్ షెడ్డులను స్థానిక బిజెపి నాయకులు శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఫుట్ పాత్ షెడ్డులను నిర్మించి మూడేళ్లు కావస్తుంది గత ప్రభుత్వ హయాంలో నిర్మించినప్పటికీ అప్పటి పాలకుల నిర్లక్ష్యం వలన వీధి వ్యాపారులకుకేటాయించలేకపోయారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపుగా సంవత్సరంన్నర కావస్తున్నా వీధి వ్యాపారులకు షెడ్డులను అందించలేక పోయారు.ఒకవైపు అసంపూర్తిగా వదిలేశారు. ఇంకా కొన్నిపనులు అలాగే ఉన్నాయి.గత పాలకవర్గం దిగిపోయిన వెంటనే ఇప్పుడు హడావుడిగా షెడ్డుల పంపకానికి మున్సిపాలిటీ అధికారులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పత్రికా ప్రకటన చేశారు. ఈ ప్రకటనలో ఎలాంటి నియమ నిబంధనలు తెలుపకుండా వ్యాపారులను అయోమయానికి గురిచేస్తున్నారు. చాలామంది వీధి వ్యాపారులకు ప్రకటన వచ్చిన సంగతి కూడా తెలియదు కాబట్టి గడువు తేదీని మరికొన్ని రోజులు పొడిగించాల్సిందిగా కోరుతున్నాం.అలాగే దాదాపు 40 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు వ్యాపారాలు నడిపిన స్థానికులకే షెడ్డులను ఇవ్వాల్సిందిగా కోరారు.స్థానిక వీధివ్యాపారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పారదర్శకంగా కేటాయింపు పద్ధతిని పాటించాలిలేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ తరపున పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండెల రామచంద్రారెడ్డి,గుర్రాల రాంభూపాల్ రెడ్డి, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్,జిల్లా ఉపాధ్యక్షులు నీరుకంటి రాఘవేంద్ర గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య కృష్ణ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నరెడ్ల శేఖర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మేంబర్ బృంగివివేకానంద, మాజీ మండల అధ్యక్షులు సురేందర్ గౌడ్, బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్ మాయని రాజశేఖర్,సోషల్ మీడియా ఇన్చార్జ్ లక్ష్మీనరసింహ, నాయకులు సాయికుమార్, వాకిటి శ్రీకాంత్, అరవింద్ రెడ్డి, తౌడోజు అఖిల్, కార్యకర్తలు పాల్గొన్నారు

# యాదాద్రి భువనగిరి జిల్లా పంచాయతీ కార్యదర్శిల డైరీ ఆవిష్కరించిన-డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామపంచాయతీ కార్యదర్శుల డైరీ ఆవిష్కరించిన.బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయపరిచి. సమగ్ర సమాచారం సేకరించి. ప్రజాప్రతినిధులకు అందజేయడానికి. ప్రజలకు. ప్రభుత్వానికి వారధిగా ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తారని కార్యదర్శులను వారిని కొనియాడారు. డైరీ ఆవిష్కరణ అనంతరం డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ నీ పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు, ఈ డైరీ ఆవిష్కరణలో యాదాద్రి భువనగిరి జిల్లా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

# ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో యువతకు ఉద్యోగాల కల్పన కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విశేష కృషి:

**మధు యాష్కి గౌడ్ ఫాక్స్ కాన్ కంపెనీలో ఉద్యోగాల కోసం మధు యాష్కి గౌడ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా**



ఎల్బీనగర్,1 మార్చ్ :కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కిందని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. ఫాక్స్ కాన్ కంపెనీ లో ఉద్యోగాల కల్పనలో భాగంగా మధుయాష్కి గౌడ్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను శనివారం హస్తినాపురం లోని ఏఎంఆర్ కన్వెన్షన్ హల్ లో నిర్వహించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో జాబ్ మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన పలువురికి నియామక పత్రాలను మధుయాష్కీ అందజేశారు. ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగుల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాహుల్ గాంధీ కూడా నిరుద్యోగ సమస్య రూపుమాపే విషయంపై పోరాడుతున్నారన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో దేశ విదేశాల నుంచి కంపెనీలు తెలంగాణకు వస్తున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలన్నారు. ఫాక్స్ కాన్ కంపెనీ వారు నగరానికి 70 కిలోమీటర్ల పరిధిలో ఉచిత బస్సు, ఉచిత భోజనం, ఈ ఎస్ఐ, పీ ఎఫ్ సదుపాయాలను కల్పిస్తూ, ఉద్యోగాలు ఇస్తున్నారని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎల్. బి. నగర్, మహేహశ్వరం, ఇబ్రహీంపట్నం ప్రాంతాల వాసులు ఉద్యోగాలు పొంది ఆర్థిక ఉపశమనం పొందవచ్చన్నారు. కాలనీలు బస్తీలలోనూ జాబ్ మేళాలు నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులకు ఈ సందర్భంగా సూచించారు. ఫాక్స్ కాన్ కాంపెనీలో 90 శాతం యువతులకు, 10 శాతం యువకులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్, కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ నేలపాటి రామారావు, పాశం అశోక్ గౌడ్, బుడ్డా సత్యనారాయణ, టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ అంగోతు వెంకటేష్ , నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, దాము మహేందర్ యాదవ్, శశిధర్ రెడ్డి , కొండోజు శ్రీనివాస్, విద్యా రెడ్డి, ఫాక్స్ కాన్ కంపెనీ ప్రతినిధులు మణికంఠ, లోకేష్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ మాసంలో కనీస సౌకర్యాలు కల్పించాలి

## - సబ్ కలెక్టర్ అమిత్



మిర్యాలగూడ , మార్చి 1:- (వార్త మిర్రర్) రంజాన్ మాసంలో కనీస సౌకర్యాలు కల్పించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ కోరారు. శనివారం స్థానిక సబ్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన అఖిల పక్షం, ముస్లింల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అంతరాయం లేకుండా తాగు నీటి, విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తొలుత జమాతే అవామ్ అధ్యక్షుడు ఎం.ఎ.సమీఖాద్రీ మాట్లాడుతూ తెల్లవారుజామున సహరి, సాయంత్రం ఇఫ్తార్ సమయంలోనే విద్యుత్ సరఫరా లేకుండా పోతుందని అన్నారు. అనంతరం ట్రాఫిక్ సమస్యపై జరిగిన సమావేశంలో సబ్ కలెక్టర్ అమిత్ మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులు తొలగించడానికే ప్రధాన రోడ్డు ఫుట్ పాత్ బండ్లను తొలగించే చర్యలు తీసుకుంతున్నామన్నారు. అసలు ఫుట్ పాత్ పై ఎలాంటి వ్యాపారాలు చేయడానికి అవకాశం లేదని ఫుట్ పాత్ వ్యాపారుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ ఎన్.హరిబాబు మాట్లాడుతూ పట్టణంలోని 5 ప్రభుత్వ స్థలాలు గుర్తించామని వాటిలో వ్యాపారాలు చేసుకోవాలని ఆయన తెలిపారు. గత 60 ఏండ్ల నుండి ఫుట్ పాత్ వ్యాపారులు జీవిస్తున్నారని వారి పొట్ట కొట్ట వద్దని కొందరు నాయకులు కోరగా ఏది ఏమైనా ట్రాఫిక్ మెరుగు పరచడానికి తప్పదని డిఎస్పీ కె.రాజశేఖర్ రాజు అన్నారు. ప్రజల మేలు కఠినంగా వైవహరించక తప్పదని ఆయన తెలిపారు. సోమవారం ఐదు ప్రదేశాలను ఫుట్ పాత్ వ్యాపారులతో కలిసి చూపుతామని మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ అన్నారు. సమావేశంలో డిఎట శ్రీనివాస్ శర్మ, ఎంపీడిఓలు ఎం.శేషగిరిశర్మ, శ్రీనివాస్ మూర్తి, ఎంపీఓ మాతంగి రమేష్, విద్యుత్ ఎడిఎ కె. రవికుమార్, సీఐలు నాగార్జున, వీరబాబులు పాల్గొన్నారు.



# విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు విజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

ఎల్బీనగర్,1 మార్చి విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలలో భాగంగా వివేకానంద నగర్ లోని పానీనియా మహా విద్యాలయ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలను పానీనియా మహావిద్యాలయ పాఠశాల ప్రిన్సిపల్ ఉషారాణితో కలిసి ఆయన పరిశీలించారు. భౌతిక శాస్త్రంలో ఉన్న హైడ్రాలిక్ లిఫ్ట్ , గాలి, నీరు, బొగ్గు ద్వారా విద్యుత్ తయారీ విధానం, సౌరశక్తి వినియోగం, వాటర్ హైడ్రాలిక్ క్రేన్, స్మార్ట్ కళ్లద్దాలు, డయాలసిస్, గుండె పనితీరు రసాయన చర్యలు, కంప్యూటర్ నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచినవి. విజ్ క్లబ్ ద్వారా డ్రోన్ ప్రదర్శన, డ్రైవర్ లేకుండా వారు నడిపే విధానం నమూనాలు విద్యార్థుల్లోని వైజ్ఞానిక ప్రతీకగా నిలిచినవి. విద్యార్థులు తాము రూపొందించిన నమూనాల పనితీరు గురించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వివరించిన తీరు ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థులు ఉత్తమ శాస్త్ర వేత్తలుగా ఎదగాలని ప్రిన్సిపాల్ ఉషారాణి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిజిఎం సతీష్, జోనల్ కో ఆర్డినేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# జననేతకు పట్లోళ్ల కార్తీక్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ.

**-గజమాలతో, పూల వానతో, తడిసి ముద్దయిన బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయము.**

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( ధనుంజయ్ నేత ) ..మార్చి : 1 ...

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి శంషాబాద్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో,.. రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి జన్మదిన సందర్భంగా జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి... మహేశ్వరం నియోజకవర్గం సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి, సామ సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, పూల వర్షం కురిపించడం జరిగినది.. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కందుకూరు మండల నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, కాకి దశరథ,సూరసాని దర్శన్ రెడ్డి,డీసీసీబీ డైరెక్టర్, పొట్టి ఆనంద్ వెంకటేష్, రామాంజనేయులు, నియోజకవర్గము నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు వందల సంఖ్యలో పాల్గొని జననేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది.



# వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయ అదికారులు

మందమర్రి మార్చి1 : వార్త మిర్రర్ ప్రతినిధి

మండలంలోని వ్యవసాయ పొలాలను మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ముత్యం తిరుపతి, సయిండ్ల కనకరాజులు పరిశీలించారు. శనివారం మండలంలోని అందుగులపేట గ్రామ వరి పొలాలను పరిశీలంచారు. వరిలో ముఖ్యంగా జింకు లోపంతో పాటు మొగి పురుగు,సల్ఫర్ హాని ఉన్నట్లు గుర్తించారు. జింక్ లోప నివారణకు జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే మొగి పురుగు నివారణకు క్లోరాంతనిలిప్రోల్ 60 మీ.లీ ఒక ఎకరానికి పై పాటుగా పిచికారీ చేసుకోవాలని,అదే విదంగా సల్ఫర్ ఇంజురీ నుంచి కాపాడుకోవడానికి పొలాన్ని చీమ నెర్రె వచ్చేలా ఆరబెట్టి నీళ్లు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు హనుమంత రెడ్డి, దుర్గం శ్రీను, మల్లేష్ లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

**-బిఎస్పి చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్-**



మందమర్రి మార్చి 1: వార్త మిర్రర్ ప్రతినిధి మండలంలోని ప్రభుత్వ భూములను అక్రమార్కులు, రీయల్ ఎస్టేట్ వ్యాపారుల కబంధ హస్తాల నుంచి కాపాడి విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) చెన్నూరు నియోజకవర్గం అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ సభావత్ మోతిలాల్ నాయక్ కు వినతి పత్రం అంద చేశారు. ఈ సందర్భంగా ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని మందమర్రి శివారు సర్వే నంబర్ 364 లో ఎకరం 30 గుంటలు భూమి రెవెన్యూ రికార్డులలో ప్రభుత్వ భూమిగా ఉందని, సదరు ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంచర్ వేసి ప్లాట్లుగా చేసి అమ్మకాలు జరిపారని, అదే వెంచర్లో కొన్ని సంవత్సరాల క్రితం ఫామ్ హౌస్ నిర్మించారని అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారని ఆరోపించారు. సదరు ప్రభుత్వ భూమిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలో అనుమతి లేకుండా వెలుస్తున్న అక్రమ వెంచర్లపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు విఫలమైతే బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు వేముల వీరేందర్, దాగామ శ్రీనివాస్, కుమ్మరి కృష్ణ చైతన్య లు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

**-సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్-**



మందమర్రి మార్చి 1: వార్త మిర్రర్ ప్రతినిధి

కనీస వేతనాల పెరుగుదలకై,న్యాయమైన హక్కులు డిమాండ్ల సాధనకు కాంట్రాక్ట్ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సిఐటియు)రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన ఏరియా సివిల్ కాంట్రాక్ట్ కార్మికుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ అనుకూల విధానాలతో కనీస వేతనాల జీవోలను సవరించకుండా, వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో కార్మిక వర్గం శ్రమ దోపిడీకి గురవుతు, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేక, కొనుగోలు శక్తిలేక కుటుంబాలను పోషించుకోలేని దుస్థితిలోకి కార్మిక వర్గం వెళ్లుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కాంట్రాక్ట్ కార్మికులంతా ఏకమై ఐక్య పోరాటాలతో కనీస వేతనాల పెంపుదల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు.అనంతరం సివిల్ కాంట్రాక్ట్ కార్మికుల నూతన పిట్ కమిటీ ఎన్నుకున్నారు. పిట్ కమిటీ అధ్యక్షుడిగా అల్లంల వెంకటేష్ కార్యదర్శిగా ఎండి ఇమామ్, ఉపాధ్యక్షులుగా జంగంపల్లి సతీష్, ఈ శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా బి సదానందం,ఎం శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా ఎం శివకుమార్, ప్రచార కార్యదర్శిగా ఎం తిరుపతి, కమిటీ సభ్యులుగా ఈ సారయ్య, ఏ రాజయ్య, కే సందీప్, ఆర్ బాలరాజు, ఎస్ రమేష్, ఆర్ శ్రీనివాస్, కే సాగర్, కే రంజిత్, టి రాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్ రాజేంద్ర ప్రసాద్, నాయకులు కుమార్, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలి

**లిడాక్టర్ అంజిరెడ్డి రివర్ ఆసుపత్రి ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే బిఎల్ఆర్**



మిర్యాలగూడ, మార్చి 1:- (వార్త మిర్రర్)మిర్యాలగూడ పట్టణం చర్చిరోడ్డులో నూతన డాక్టర్ అంజిరెడ్డి రివర్ ఆసుపత్రిని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ గతంలో ఈ భవనంలో ప్రారంభించిన ఆసుపత్రితో ప్రజలు ఇబ్బంది పడ్డారని అలా జరగకుండా చూడాలని కోరారు. అదేవిధంగా నేరుగా వచ్చిన మాజీ శాసన సభ్యులు, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి నల్లమోతు భాస్కర్ రావు ఆసుపత్రిలోని ఇఎంటీ, సిజేరియన్ వార్డులను ప్రారంబించి మాజీ శాసన సభ్యులు భాస్కర్ రావు మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గ పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, అలాగే పేద , మధ్యతరగతి ప్రజలకు కూడా ఫీజు అందుబాటులో ఉండేలా వైద్యం అందించాలని కోరారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆసుపత్రి సందర్శించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.లాభపేక్షతో కాక సేవ భావంతో మెరుగైన వైద్య సేవలు అందించి ఆదరణ పొందాలని డిసిసి అధ్యక్షుడు కె.శంకర్ నాయక్ అన్నారు. అనుభవజ్ఞులైన డాక్టర్లున్న అంజిరెడ్డి రివర్ ఆస్పత్రిలో అధునాతన వైద్యాన్ని సరసమైన ధరలకు సామాన్యులకు అందించాలని కోరారు. 1978 నుండి పల్నాడు ప్రాంతంలో ఎంతో అనుభవం కలిగిన డాక్టర్ గా పేదల డాక్టర్ గా పేరు పొందిన డాక్టర్ అంజిరెడ్డి ఈ ప్రాంతంలో హాస్పటల్ ఏర్పాటు చేయడంఅభినందనీయమన్నారుగతంలో ఆస్పత్రుల్లో జరిగిన చేదు అనుభవాలను పునరావృతం కాకుండా, మెరుగైన వైద్యాన్ని పేదలకు అందజేయాలని కోరారు. అనంతరం ఆస్పత్రి యాజమాన్యం, డాక్టర్ లోకిరెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ అనుభవమైన వైద్యులు ఉన్న తమ ఆసుపత్రులు ముఖ్యంగా గుండె, గ్యాస్ట్రోఎంటరాలజీ, మెదడుకు సంబంధించిన శాస్త్ర చికిత్సలు అధునాతన పద్ధతుల్లో జరుపబడతాయి అన్నారు. మోకాళ్ళ జాయింట్ రీప్లేస్మెంట్ సేవలు, పుట్టుకతోనే చెవుడు మూగవారికి ప్రత్యేక వైద్యం అందజేస్తామన్నారు. మరో 15 రోజుల్లోగా ఆరోగ్యశ్రీ సేవలు కూడా తమ ఆసుపత్రిలో అందుబాటులోకి వస్తాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రైవేట్ ఉద్యోగులకు ఈఎస్ఐ వైద్య సేవలు అందించబడతాయ న్నారు. ఇప్పటికే ఆంధ్రలో పలు ప్రాంతాలలో ఆసుపత్రులు, నర్సింగ్ ఫార్మసీ వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తుండటమే తమ పనితనానికి గీటురాయిగా చెప్పారు. అధునాతన వైద్యం కోసం హైదరాబాద్ గుంటూరు వంటి పట్టణాలకు వెళ్లి వ్యయ భారం పడకుండా మిర్యాలగూడలోనే అన్ని సేవలు అందించేందుకు తమ ఆసుపత్రి లో వైద్య సేవలు అందుబాటుల. కార్యక్రమంలో ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ లోకిరెడ్డి అంజిరెడ్డి, చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సుష్మ, సీనియర్ మేనేజర్ శ్రావణ్ కుమార్, పరిటాల సత్య, విజయ్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిషోర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్రెడ్డి, గంధం రామకృష్ణ పాల్గొన్నారు.

# వైభవంగా అల్లీపూర్ శ్రీ రాజరాజేశ్వర స్వామి రథోత్సవం



వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 1 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ శ్రీ రాజరాజేశ్వరక్షేత్రంలో పార్వతీరాజరాజేశ్వరస్వామి ల రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాజరాజేశ్వరస్వామివారి దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవం లో భాగంగా శుక్రవారం రాత్రి శివ పార్వతుల కల్యాణోత్సవం నాలుగోరోజు శనివారం రోజున ప్రధాన ఘట్టమైన స్వామివారల రథోత్సవాన్ని అశేష భక్తజనం మధ్య అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథంపై దర్శనమిచ్చిన స్వామివారలను దర్శించుకుని భక్తజనం పులకించిపోయారు. రంగు రంగులపూలతో అందంగా అలంకరించిన రథ%శీ% పై పార్వతీ రాజరాజేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఉంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి శాశ్వత అన్నదాన ట్రస్ట్ నేతృత్వంలో అర్చకులు శ్రీ అంగడి భూమేశ్వర్, పరమేశ్వర్, వినాయకుమార్, విక్రమ్ లు రథ ప్రతిష్ఠ, రథహెూమం, రథబలి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రాజ రాజేశ్వర శాశ్వత అన్నదాన ట్రస్ట్ అధ్యక్షులు దాసరపు వేణు నైవేద్య ప్రసాదం నెత్తిన పెట్టుకొని డప్పు సన్నాయి వాయిద్యాలతో ఊరేగింపు గా వెళ్లి నైవేద్య ప్రసాదం పరమశివునికి సమర్పించి తదనంతరం ఊరేగింపు రథయాత్ర నిర్వహించడం జరిగింది. అనంతరం భక్తుల జయ జయ ద్వానాల మధ్య గ్రామ వీధుల మీదుగా రథోత్సవం నిర్వహించగా, స్థానిక మహిళలు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ రథోత్సవం కన్నుల పండువగా సాగింది. రథోత్సవం సందర్భంగా స్థానిక యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. అనంతరం అన్న ప్రసాద ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అల్లీపూర్ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పరమశివుని దర్శించుకుని అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దాసరపు వేణు, ఉపాధ్యక్షులు రెండ్ల రాజం, కోశాధికారి రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి అంగడి పరమేశ్వర్, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ప్రచార కార్యదర్శి రోజా, కార్యవర్గ సభ్యులు నాయిని గంగిరెడ్డి, పాముల గంగాధర్, అనుమల్ల రాజ్ కుమార్, బొమ్మ కంటి ఉమేష్, రేపాక రమేష్, తోడేటి శేఖర్, కట్ట రాజేష్, ఎర్ర వేణి సురేష్, కొల్లూరి రాజేందర్, కార్యదర్శి లైశెట్టి శేఖర్, మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ మోర విజయలక్ష్మి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ బాలే చంద్రశేఖర్, ఫాక్స్ చైర్మన్ రాజలింగం, జగిత్యాల రూరల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ చిట్యాల భూమయ్య,నామని లక్ష్మీ నరసయ్య, ఎంబారి వెంకట్ రెడ్డి, కారోబార్ రాజేందర్, హనుమాన్ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# యువ నాయకుడు కార్తీక్ రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( ధనుంజయ్ నేత ) ..మార్చి : 1 ...



రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని శంషాబాద్ రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సబితా ఇంద్రా రెడ్డి తనయుడు, యువ నాయకుడు, జాతీయ స్పోక్స్ పర్సన్, బిఆర్ఎస్ పార్టీ రాజేందర్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పటోళ్ల కార్తీక్ రెడ్డి జన్మదిన సందర్భంగా తల సేమియా బాధితులకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం, మహేశ్వరం నియోజకవర్గం, చేవెళ్ల నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు ఈ సందర్భంగా పటోళ్ల కార్తీక్ రెడ్డిని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ నా పైన ఉన్న నమ్మకం దృష్టిలో ఉంచుకొని నలుమూలల నుంచి తరలివచ్చి నన్ను ఆశీర్వదించి నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి ఎంతో రుణపడి ఉంటానని హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కుటుంబ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.

# శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బాలునాయక్





దేవరకొండ మార్చి 01 వార్త మిర్రర్ :

దేవరకొండ మండలం కమలాపూర్ ముదిగొండ శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆశీస్సులు ఆశీర్వాదాలు అనుగ్రహం పొందాలని ఆయన కోరారు. కొన్ని వందల సంవత్సరాలు చరిత్ర కలిగిన పురాతన దేవాలయం అని ఈ దేవాలయంలో ఆ వీరభద్ర స్వామి భక్తులకు కోరిన కోరికలను కొంగుబంగారంగా తీరుస్తాడని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి దైవచింతల మానసికచింతనతోనే ప్రశాంతత లభిస్తుందని వాటితో పాటు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని వారు కోరారు. అనంతరం ఆలయ కమిటీ ఆలయ అర్చకులు వారిని సాల్వాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ముదిగొండ మాజీ ఎంపిటిసి మల్లెపల్లి జీవన్ రెడ్డి తుమ్మలపల్లి లీలా రవికాంత్ రెడ్డి టీపీసీసీ మీడియా జిల్లా కోఆర్డినేటర్ నర్రబాలు మాజీ సర్పంచ్లు నర్య నాయక్ లక్ష్మణ్ నారాయణ మాజీ ఎంపిటిసి ఎక్కువ నాయక్ అనపర్తి లక్ష్మయ్య కోట్య నాయక్ మల్లిపెద్ది లక్ష్మీనారాయణ మొరిగే మల్లేష్ యాదవ్ వడ్లపల్లి ప్రభాకర్ రెడ్డి కౌర్య నాయక్ సత్యం తదితరులు పాల్గొన్నారు.



# దేవరకొండలో ఘనంగా మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

దేవరకొండ మార్చి 01 వార్త మిర్రర్ ::దేవరకొండ పట్టణంలో మార్చి 01 తేదీన మాదిగ అమరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్-టిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి రంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ పొట్ట మురళి మాదిగ మాట్లాడుతూ ఏ బి సి డి అంగీకరణ కోసం ఎన్నో ఉద్యమాలు చేసి ప్రాణ త్యాగం చేసిన అమరవీరులను ఈరోజు స్మరించుకోవడం గొప్ప విషయమని వారన్నారు. వర్గీకరణ ఎలక్షన్ గా పనిచేసే ప్రాణాలు కోల్పోయిన మాదిగ అమరవీరులకు వారు చేసిన త్యాగాలు మరువలేని అంటూ వారి ఆశయాలను నెరవేర్చేదాక ఈ పోరాటాలు ఉద్యమాలు చేస్తూనే ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర ఆంజనేయులు వివిధ మండలాల అధ్యక్షులు చందంపేట మండల అధ్యక్షులు అందుగుల సైదులు మాదిగ కొమ్ము ఉదయ్ కుమార్ చాట్ల ప్రశాంత్ తరి గోవర్ధన్ ఎలిమినేటి ఈశ్వర్ టైగర్ జీవ చందర్ లక్ష్మయ్య మహేందర్ ఆనంద్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# డిండి లో పేకాటరాయుళ్ల స్థావరాలపై ఆకస్మిక దాడి చేసిన పోలీసులు

డిండి మార్చి 01 వార్త మిర్రర్ :డిండి మండలంలో పేకాటరాయుళ్ల స్థావరాలపై ఆకస్మిక దాడి చేసిన పోలీసులు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం శనివారం నాడు మధ్యాహ్నం సమయంలో డిండి మండలం తవక్లాపూర్ గ్రామ సరిహద్దుల్లో చాకలి గుట్టపై పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో గుట్టపై పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు.పట్టుబడిన వారిలో తోకల మురళి ఎండి ఖదీర్ వరికుప్పల రమేష్ గోదాసు జైపాల్ లను పోలీసులు అదుపులోకి తీసుకోగావారి దగ్గర నుండి 2760/- రూపాయలు నగదును రెండు ద్విచక్ర వాహనాలు మూడు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకొని వాటిని సీజ్ చేశారు. సంఘటన స్థలం లో నేరస్తులను పట్టుకునే సమయంలో గోరటి సైదులు దూల అలేందర్ లు తప్పించుకున్నారని ఎస్సై రాజు తెలిపారు. పేకాట స్థావరంలో పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసామని డిండి ఎస్సై రాజు తెలియజేశారు.



# మస్కతి ఐస్ క్రీమ్ పార్లర్ ను ప్రారంభించిన శ్రీరాములు అందెల

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( ధనుంజయ్ నేత ) ..మార్చి : 1 ...

మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ ఇమామ్ గూడ లో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి మస్కతి ఐస్ క్రీమ్ పార్లర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ తో కలిసి హాజరై ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములు యాజమాన్యులు అనిల్ రెడ్డి, దిలీప్ రెడ్డి మరియు నరేందర్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు బరిగెల హేమలత రాజు గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రచ్చ లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్లు కాంటెకర్ మధుమోహన్, శివకుమార్ గౌడ్, శివయ్య గౌడ్, జపాల సుధాకర్, బోధ యాదగిరి రెడ్డి, బాకీ విలాస్ జిల్లా దిశా కమిటీ సభ్యులు అంబోజి శ్రీనివాస్, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు ఆంజనేయులు, దొంత్రమౌని రాజు, బడంగ్ పేట్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ తోట శ్రీధర్ రెడ్డి, బీజేవైఎం నాయకులు అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.